# నేడు దుబ్బాకకు గులాబీ అధినేత

## నేడు దుబ్బాకలో సీఎం కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'

- సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించిన దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి
- భారీ జన సమీకరణకు సన్నాహాలు
- గులాబీమయంగా దుబ్బాక


దుబ్బాకలో సీఎం కేసీఆర్ సభకు సిద్ధమవుతున్న వేదిక


దుబ్బాకలో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 25: బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ ఆదివారం నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాకకు వస్తున్నారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉండగా దుబ్బాకలో జరిగే ప్రజా ఆశీర్వాదసభలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. దుబ్బాకలో బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తుండటంతో బీఆర్ఎస్ ఈ నియోజకర్గాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి మరణంతో ఏర్పడ్డ ఉప ఎన్నికలో కొద్దిపాటి తేడాతో ఓటమి పొందిన బీఆర్ఎస్ ఈసారి భారీ మెజార్టీతో విజయాన్ని అందుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. గత ఉప ఎన్నికలో సీఎం కేసీఆర్ దుబ్బాకలో పర్యటించి ఉంటే ఫలితం మరోలా ఉండేదని మంత్రి హరీశ్‌రావు ఇటీవల దుబ్బాక పర్యటనలో మాట్లాడటం గమనార్హం. ఈ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ దుబ్బాక పర్యటన ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎం కేసీఆర్ ప్రసంగంపై ప్రజల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఉద్యమ గడ్డతో పాటు బీఆర్ఎస్‌కు కంచుకోటైన దుబ్బాక పర్యటనతో ఈసారి బీఆర్ఎస్ ఘన విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని ప్రజలు చర్చించుకుంటున్నారు. తాను పుట్టి పెరిగి ఓనమాలు నేర్చుకున్న దుబ్బాకపై ఉన్న ప్రేమతో సీఎం కేసీఆర్ దుబ్బాక అభివృద్ధికి వరాలు అందించి ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. ఎన్నికల ముఖ్య ఘట్టమైన ప్రచారం చివరి దశకు చేరుకోవడంతో గులాబీ దళపతి పాల్గొంటున్న దుబ్బాక ఆశీర్వాదసభ సభను విజయవంతం చేసేందుకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి నిమగ్నమై పనులను పర్యవేక్షిస్తున్నారు.

### సీఎం సభకు భారీగా ఏర్పాట్లు

నేడు సీఎం పర్యటన నేపథ్యంలో దుబ్బాక గులాబీమయంగా మారింది. కనివిని ఎరుగని రీతిలో ఆశీర్వాద సభను నిర్వహించేందుకు గులాబీ శ్రేణులు నిమగ్నమయ్యారు. వాతావరణం సైతం అనుకూలిస్తుండటంతో సభ ఏర్పాట్లన్ని సజావుగా సాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరిగే ప్రజాఆశీర్వాద సభకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలను, ప్రజలను తరలించేందుకు పక్కా ప్లాన్ చేశారు. దుబ్బాకలోని దుంపలపల్లి రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో గల మైదానంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. 50 వేలకు మందికి పైగా ప్రజలు సభకు హాజరవుతారని ఎంపీ తెలిపారు. సభా ప్రాంగణానికి సమీపంలోనే ప్రత్యేక హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. సభకు వచ్చే ప్రజల కోసం కుర్చీలతో పాటు సౌకర్యాలు కల్పిస్తున్నారు. పోలీసు అధికారులు సైతం సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్నారు.

## చరిత్రలో నిలిచిపోయేలా..

దుబ్బాకలో సీఎం కేసీఆర్ చేపట్టే ప్రజా ఆశీర్వాద సభకు ఎంపీ కొత్త ప్రభాకరెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దీంతో దుబ్బాక పట్టణమంతా గులాబీమయంగా మారింది. 2009, 2014 ఎన్నికల ప్రచారాల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. 2015లో పర్యటించిన సీఎం కేసీఆర్ దుబ్బాకకు వరాల జల్లు కురిపించారు. ఈ ఆశీర్వాద సభలో మరిన్ని వరాలు కురిపించి దుబ్బాక తలరాతను మారుస్తాడని ప్రజలు భావిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో ముందుండి నడిపిన దుబ్బాక ప్రాంతం బీఆర్ఎస్‌కు మొదటి నుంచి పెట్టని కోటగా ఉంది. ఈ ప్రాంతంలో నిర్వహించే ప్రజాఆశీర్వాద సభ పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు దోహదపడుతుందని పార్టీ శ్రేణులు గట్టిగా నమ్ముతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ నిర్వహించిన రోడ్‌షోలతో పార్టీ శ్రేణులతో పాటు ప్రజల్లో 'కొత్త' జోష్ నింపింది. నేడు జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభతో దుబ్బాక తలరాత మారనుందని ప్రజలు నమ్ముతున్నారు.

## సీఎం సభకు పటిష్ట బందోబస్తు

దుబ్బాక, నవంబర్ 25: దుబ్బాకలో ఆదివారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట సీపీ శ్వేత తెలిపారు. శనివారం భద్రతా ఏర్పాట్లు, సభాస్థలి, హెలీప్యాడ్, ఫార్కింగ్ స్థలాలను పరిశీలించారు. బందోబస్తుపై పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాలను ప్రత్యేకంగా కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలని సూచించారు. అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో 6 సెక్టార్లుగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు అందె శ్రీనివాస్‌రావు, ఎస్.మల్లారెడ్డి, రాంచందర్‌రావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు సురేందర్‌రెడ్డి, రమేశ్, చంద్రశేఖర్, రవీందర్ రాజు, ప్రసన్నకుమార్, శ్రీనివాస్, సీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

### పార్కింగ్ స్థలాలు

- దుబ్బాక సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పక్కన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఉన్నందున దుంపలపల్లి, చీకోడు, రామక్కపేట, ఆకారం, ఎనగుర్తి తదితర గ్రామాల వైపు నుంచి వచ్చే వాహనదారులు టీటీడీ కల్యాణ మండపం పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో పార్క్ చేయాలి.
- భూంపల్లి, ఖాజీపూర్, చేగుంట, నార్సింగ్ మండలాల నుంచి వచ్చే వారు దుబ్బాక రెడ్డి ఫంక్షన్ హాల్ పక్కన కుడి, ఎడుమ వైపున ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేయాలి.
- అప్పనపల్లి, పెద్దచీకోడు, తిమ్మాపూర్, మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్ మండలాల నుంచి వచ్చే వారు దుంపలపల్లి చెరువుకట్ట కింద ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.


దుబ్బాకలో సీఎం కేసీఆర్ సభ, హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్వేత

### ట్రాఫిక్ మళ్లింపు

అక్బర్‌పేట-భూంపల్లి, చేగుంట, నార్సింగ్, రాయపోల్, దౌల్తాబాద్ మండలాల నుంచి వచ్చే వాహనదారులు అక్బర్‌పేట కూడవెల్లి బ్రిడ్జి దాటిన తర్వాత చౌదర్‌పల్లి కమాన్ నుంచి దుబ్బాక మీటింగ్ ప్రదేశానికి చేరుకోవాలి. మిరుదొడ్డి, తొగుట మండలాల నుంచి వచ్చే వాహనదారులు ధర్మారం నుంచి దుంపలపల్లి మీదుగా దుబ్బాక సమావేశం ప్రదేశానికి చేరుకోవాలి.

## దుబ్బాకలో ఎగిరేది గులాబీ జెండానే..


దుబ్బాక: చిన్ననిజాంపేటలో ప్రచారం చేస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత, రోజాశర్మ

- బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత
- జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మతో కలిసి విస్తృత ప్రచారం

దుబ్బాక, నవంబర్ 25: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, ఈ ఎన్నికల్లో దుబ్బాకలో ఎగిరేది గులాబీ జెండానే అని బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి సతీమణి మంజులత అన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేట, తాళ్లపల్లి, నగరం, చిన్ననిజాంపేట, చిట్టాపూర్ గ్రామాల్లో జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దుబ్బాక అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటేసి ఎంపీ ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మాయమాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాష్, ఏఎంసీ చైర్మన్ చింతల జ్యోతీకృష్ణ, సర్పంచ్‌లు శంకరయ్య, రచనాకైలాష్, రాజయ్య, ఎంపీటీసీ చంద్రసాగర్, మాధవి పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

మిరుదొడ్డి(అక్బర్‌పేట-భూంపల్లి) నవంబర్ 25: కాళేశ్వరం ప్రాజెక్టుతో బీడు భూములు సస్యశ్యామలమయ్యాయని జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ అన్నారు. అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి, మోతె గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి కొత్త మంజులత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల సాయిలు, జడ్పీటీసీ సూకురి లక్ష్మి లింగం, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, కూడవెల్లి, మోతె గ్రామాల సర్పంచ్‌లు సుగుణ, శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బాల్‌రాజు, వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్, మాజీ ఎంపీపీ కవితాశ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు రవి, దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాసం, దుబ్బాక ఏఎంసీ చైర్మన్ జ్యోతికృష్ణ, ఎంపీటీసీ రాజవ్వ, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు సత్యనారాయణ, బాపురెడ్డి, కమలాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ అహ్మాద్ ఉన్నారు.

## గులాబీ జోరు.. ప్రచార హోరు

**బీఆర్ఎస్ నేతలు ప్రచారంలో జోరు పెంచారు. గులాబీ జెండా పట్టి ఊరూరా తిరుగుతున్నారు. బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.**

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 25*


దుబ్బాక టౌన్: ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు


మిరుదొడ్డి: ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


తొగుట: సీఎం సభకు తరలివాలని పిలుపునిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


రాయపోల్: ఎంపీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ చేరిన బీజేపీ నాయకులు